హడలెత్తిస్తున్న కూడలి

- ప్రమాదకర మలుపుతో ప్రజల ఆందోళన
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి



కొత్తకాలువ సెంటర్‌లో ప్రమాదాలకు నిలయమైన మలుపు

ముమ్మిడివరం: మండలంలోని కొత్తకాలువ సెంటర్ నాలుగు గ్రామాలకు కూడలి.. ఈ సెంటర్‌లో ఉన్న మలుపు ఆయా గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. గాడిలంక గ్రామానికి వెళ్లే జెడ్పీ రహదారి, అన్నంపల్లి గ్రామానికి వెళ్లే రహదారి, మర్లపాలెం, చినకొత్తలంక గ్రామానికి వెళ్లే కెనాల్ రోడ్డు ఈ ప్రాంతంలో 216 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు కొత్తకాలువ సెంటర్‌కు వచ్చేసరికి జాతీయ రహదారిని దాటాలంటే హడలిపోతున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా గ్రామాలకు వెళ్లే అప్రోచ్ రోడ్డులను తొలగించడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది.

ప్రమాదాలకు నిలయం

కొత్తకాలువ సెంటర్‌లో రోడ్డు క్రాసింగ్‌ల వద్ద ఎటువంటి అప్రోచ్‌లు ఏర్పాటుచేయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారిపై భారీ వాహనాలు వేగాన్ని అదుపు చేసే చర్యలు చేపట్టకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు వాపోతున్నారు. మండల కేంద్రమైన ముమ్మిడివరం వెళ్లాలంటే గాడిలంక, మర్లపాలెం, చినకొత్తలంక, అన్నంపల్లి, కొమానపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఈ ప్రాంతానికి చేరుకుంటారు. ఇక్కడ బస్టాప్ కూడా ఉండటం వల్ల తరచూ రోడ్డుపై వాహనాలు ఆగి ప్రయాణికులను ఎక్కించుకుంటాయి. ఇక్కడే ప్రమాదకర మలుపు ఉండటంతో రహదారిపై వచ్చే వాహనాలను గుర్తించే వీలు లేక రోడ్డు దాటే సమయంలో తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కూడలిలో రెండు వైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది. హైవే అధికారులు జీబ్రా లైన్లు, వేగం అదుపును తెలియజేసే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది. సుమారు 5 వేల జనాభా కలిగిన నాలుగు గ్రామాల ప్రజలు నిత్యం రోడ్డును దాటుతుంటారు. ఈ కూడలి ప్రాంతంలో రాత్రివేళ వాహన చోదకులకు కనిపించే విధంగా జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ లేదా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రమాదకర మలుపు ఉన్న కూడలిలో హైవే అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వెంకన్నకు పంచలోహ శ్రీచక్రం సమర్పణ



పంచలోహ శ్రీచక్రాన్ని ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవికి అందజేస్తున్న దాతలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి పట్టణంలోని వెత్సావారి అగ్రహారానికి చెందిన సోదరులు మెటమర్రి ప్రసాద్, కుమార్‌లు 23 కిలోల 112 గ్రాముల పంచలోహాలతో తయారుచేసిన శ్రీ చక్రాన్ని శనివారం సమర్పించారు. స్వామి సన్నిధిలో ఈ చక్రాన్ని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, అర్చకులకు దాతలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్త యెండూరి రాఘవ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుందాం

అమలాపురం టౌన్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించి పరిరక్షించుకుందామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రవితేజ విద్యా సంస్థల ఆవరణలో ఈ నెల 8న జరగనున్న విద్యా సంస్థల బంద్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, జిల్లా కన్వీనర్ సాపే రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎం.ప్రణీత్ సాయి, ఏఐవైఎఫ్ఐ నాయకుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు భవన పరిశీలన

ఉప్పలగుప్తం: స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి శనివారం పరిశీలించారు. స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగ మండల అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం గత కొన్నేళ్లుగా భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని చైర్‌పర్సన్ డోలామణి దృష్టికి తీసుకెళ్లారు. భవన నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. ఆమె వెంట ఏఎంసీ డైరెక్టర్‌లు చప్పిడి దుర్గారావు, నిమ్మకాయల కోటేశ్వరరావు, దంగేటి రుద్ర, ఏఎంసీ కార్యదర్శి వాసంశెట్టి రామకృష్ణ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అమలాపురం టౌన్: విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్రాంచి కార్యాలయం వద్ద బ్యాంక్ ఖాతాదారులకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడ్ యునైటెడ్ సహకారంతో జరిపిన వైద్య శిబిరంలో సుమారు వంద మందికి వైద్య సేవలు అందించారు. డాక్టర్ ఉదయ్ కుమార్ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మార్కెటింగ్ మేనేజర్ కళ్యాణ్, బ్రాంచి మేనేజర్ ప్రకాష్‌బాబు, బ్యాంక్ అధికారి సునీత, విశ్రాంత మేనేజర్ నాగాబత్తుల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాళ్లరేవు: కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం పి.మల్లవరంలోని స్థానిక శ్రీవాణీ విద్యానికేతన్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వీఆర్ఎస్‌బీ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెప్మాకు వాటర్ డిస్పెన్సర్ బహూకరణ



మెప్మా కార్యాలయానికి వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరిస్తున్న ఇండియన్ బ్యాంక్ అధికారులు

అమలాపురం టౌన్: స్థానిక పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)కు పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ శాఖ అధికారులు రూ.10 వేల విలువైన వాటర్ డెస్పెన్సర్‌ను శనివారం బహూకరించారు. మెప్మా సిబ్బంది వాటర్ డిస్పెన్సర్ బహూకరణపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ వి.గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ నారాయణ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు దేవకి, కృష్ణవేణి, రాజేశ్వరి, శ్యామలతో పాటు ఆర్పీలు పాల్గొన్నారు.

తెలుగు భాషా మహా అక్షర యజ్ఞం

యానాం: తెలుగు భాషాభివృద్ధి కోసం వంద దేశాల్లో తెలుగు సంఘాల సంయుక్త నిర్వహణలో మహా అక్షర యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు వందే విశ్వమాతరమ్ నిర్వాహకుడు చిగురుమళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వందే విశ్వమాతరమ్ పోస్టరును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కర రెడ్డి, ప్రముఖకవి దాట్ల దేవదానంరాజు, అధ్యాపకులు సుధాకర్, రమేష్ విజయ సాగర్, విష్ణుమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిగురుమళ్ల మాట్లాడుతూ 100 దేశాల్లో శాంతి, సద్భావనాయాత్ర 2023–25 వరకూ జరుగుతుందన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

డీఎస్పీ అంబికా ప్రసాద్



మున్సిపల్ కాలనీలో బాణసంచా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్ తదితరులు

అమలాపురం టౌన్: రాబోయే దీపావళి కోసం మందుగుండు, బాణసంచా తయారుచేసే లైసెన్స్ కేంద్రాల్లో నిబంధనలు పాటించకపోతే కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ హెచ్చరించారు. అమలాపురం పట్టణం, రూరల్ మండల ప్రాంతాల్లో ఉన్న లైసెన్స్ బాణసంచా తయారీ లైసెన్స్ కేంద్రాలను డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆయా ప్రాంతాల సీఐలు, ఎస్ఐలతో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల నిర్వాహకులతో డీఎస్పీ మాట్లాడి పలు సూచనలు చేశారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కేంద్రాల్లో పాటిస్తున్న భద్రతాపరమైన ప్రామాణికాలు, జాగ్రత్తలపై డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా కేంద్రాల వద్ద అగ్నిప్రమాద నివారణ జాగ్రత్తలు, నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ అమలాపురం పోలీసు సబ్ డివిజన్‌లో ఆరు లైసెన్స్ బాణసంచా కేంద్రాలున్నాయని చెప్పారు. అమలాపురం పట్టణం మున్సిపల్ కాలనీ, అమలాపురం రూరల్ మండలం పేరూరు, తాండవపల్లి శివారు శెట్టిపల్లి, ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి, ఐ.పోలవరం మండలం కొమరగిరి, కాట్రేనికోన మండలం గెద్దనాపల్లిలో లైసెన్స్ బాణసంచా కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో అమలాపురం పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, రూరల్ సీఐ పి.వీరబాబు, ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య, ఆయా ప్రాంతాల ఎస్ఐలు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

ముమ్మిడివరం: నగర పంచాయతీ శివారు సోమిదేవరపాలెంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన ఉందుర్తి భాస్కరరావు కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ సొసైటీ నిత్యావసర సరకులు పంపిణీ చేసింది. శనివారం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాలతో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా వంట సామగ్రి, టార్పాలిన్, హైజిన్ కిట్స్, బియ్యం, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు పెయ్యల చిట్టిబాబు, తాడి అచ్యుత రామయ్య, చెల్లి మధు, బుడితి సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

100 మంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: స్థానిక పరదేశమ్మ వీధిలోని క్రీం కాంపౌండ్ ప్రాంగణంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ పుట్టినరోజు సందర్భంగా శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 100 మంది రక్తదానం చేశారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కాకినాడ రోటరీ క్లబ్ మెడికల్ ఆఫీసర్ పసుపులేటి కామరాజు నేతృత్వంలో శిబిరం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్‌సాగర్‌కు ఎమ్మెల్యే పొన్నాడ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కు సత్కారం



ప్రవీణ్‌ను సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్, జేసీ నుపూర్‌అజయ్ చేతుల మీదుగా డొక్కా సీతమ్మ అవార్డు అందుకున్న రెడ్డిపల్లికి చెందిన కరాటం ప్రవీణ్‌ను రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం రాత్రి శాలువాతో సత్కరించారు. ప్రవీణ్‌ను ఎంపీ చింతా అనూరాధ, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, డీఎస్పీ అంబికా ప్రసాద్, కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీహరిరామ్‌గోపాల్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ డోలామణి తదితరులు అభినందించారు.

‘శ్రీమద్రామాయణ పారాయణం’ పుస్తకావిష్కరణ



శ్రీమద్రామాయణ పారాయణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన రచయిత, నాణేలు, కరెన్సీ నోట్ల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ రచించిన ‘తొమ్మిది రోజుల్లో శ్రీమద్రామాయణ పారాయణం’ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక భూపయ్య అగ్రహారం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి జరిగింది. మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు, బుర్ర కథ కళాకారుడు బందా కామేశ్వరరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాన్ని చక్కా సత్యనారాయణమూర్తి సమీక్షించారు. ఆర్ట్ ఫ్యామిలీ అధ్యక్షురాలు తాతపూడి సౌమ్య లక్ష్మి పుస్తకం తొలి ప్రతిని స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు పేరి సత్యవాణి, కొత్తూరి బాల, ఆంధ్ర ఉషారాణి, గోటేటి గంగాధర్, ఇవటూరి రవి సుబ్రహ్మణ్యం, వేదనభట్ల సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావుకు ఘన నివాళి



ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు

అల్లవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వర్తిస్తూ చనిపోయిన కొండా వెంకటేశ్వరరావు మృతికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు శనివారం సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు చిత్రపటానికి ఎంపీపీ శేషగిరిరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ఏడుకొండలు, ఏఓ లక్ష్మణరావు, కార్యదర్శులు రాజా, రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, ఎన్‌వీవీ సత్యనారాయణ, శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని కలిగించాలి



విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ఎగ్జిబిట్స్

యానాం: విద్యార్థుల్లో సైన్స్, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలపై ఆసక్తిని కలిగించాల్సిన ఆవశ్యకత ఉందని ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం రీజెన్సీ స్కూల్‌లో ఏర్పాటుచేసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తయారుచేసిన 140 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. వీటిలో ప్రాథమిక పాఠశాల నుంచి 92, మిడిల్ స్కూల్ విద్యార్థులు 40, హైస్కూల్ స్థాయి విద్యార్థులు 8 ఎగ్జిబిట్స్‌ను తయారుచేశారు. న్యాయనిర్ణేతలుగా పి.బాలాజీ, ఎం.సతీష్‌కుమార్, పుష్పకుమారి, వరలక్ష్మి, అశ్విని, క్రాంతికుమార్, ఉషారామలక్ష్మి వ్యవహరించారు. వీటిలో ఎంపికైన ఎగ్జిబిట్స్‌ను త్వరలో జరిగే యానాం రీజియన్ విద్యావైజ్ఞానిక ప్రదర్శనకు పంపనున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కొమరగిరిపట్నంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం, బెండమూర్లంక, ఓడలరేవు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణ చేసుకోవడానికి రెండు రోజుల పాటు ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటుచేశామని చెప్పారు. వచ్చే నెలలో మరో రెండు రోజుల పాటు ప్రత్యేక క్యాంపెయిన్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి కోరారు. ఆయన వెంట తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఆర్ఐ దుర్గాశ్రీనివాస్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రదీప్‌కుమార్



ఆకర్ష

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ గొలకోటి ఫణీంద్ర శనివారం తెలిపారు. గొల్లవిల్లి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కడిమి ప్రదీప్‌కుమార్, 9వ తరగతి చదువుతున్న తోకల ఆకర్ష ఇటీవల కాకినాడ జిల్లా పటవలలో జరిగిన ఎంపికల్లో అండర్–17 విభాగంలో సాఫ్ట్‌బాల్‌లో తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.రాణి, పీడీ డి.సరస్వతి, పీఈటీ వి.విజయభాస్కర్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

భారీ అన్నసంతర్పణ

తాళ్లరేవు: స్థానిక కేశవపురంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత కేశవ స్వామివారి ఆలయంలో శనివారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీనివాస్, పాలకవర్గ సభ్యుల నేతృత్వంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- విలసవిల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



విలసవిల్లిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని విలసవిల్లిలో శనివారం ఆయన కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఎక్కడైనా సాంకేతిక లోపాలతో లబ్ధిదారులకు పథకాలు అందకపోతే సరిచూసి అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సీఎం జగన్ ప్రభుత్వంలో విద్యకు, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గ్రామ ప్రజలకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు గ్రామానికి 6 కిలోమీటర్ల దూరంలో ఇవ్వటంతో అక్కడ నివసించడానికి ప్రజలు స్థలాలను తిరస్కరించారని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి మంత్రికి వివరించారు. తమ గ్రామంలోనే ప్రభుత్వ భూమి అధికంగా ఆక్రమణలో ఉందని, ఆ ఆక్రమణలు తొలగించి భూమిని గ్రామ ప్రజలకు అందించాలని సర్పంచ్ కోరారు. అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను, ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, కోలా ఏసు, పుత్సల ఏసు, వడ్డి ధర్మేష్, ముషిణి లింగేశ్వరరావు, బీర నరసింహమూర్తి, కర్రా చిన్నా, ఆశపు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని గురుకులాలే ప్రభుత్వ లక్ష్యం

సోషల్ వెల్ఫేర్ కమిషనర్ విజయ్‌కృష్ణన్



విద్యార్థులతో మాట్లాడుతున్న సోషల్ వెల్ఫేర్ కమిషనర్ విజయ్‌కృష్ణన్

అల్లవరం: సమస్యలు లేని గురుకులాలే ప్రభుత్వ లక్ష్యమని సోషల్ వెల్ఫేర్ కమిషనర్ విజయ్‌కృష్ణన్ అన్నారు. శనివారం అల్లవరం మండలం గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులాన్ని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నుపూర్, సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి పావనమూర్తి, అడిషనల్ డైరెక్టర్ రఘురామ్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులంలో ప్రతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారికున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్లు సరిగా లేవని కొందరు విద్యార్థులు బదులిచ్చారు. మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా లేదా, భోజనం రుచిగా ఉంటుందా లేదా అని ప్రశ్నించారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని బాగా చదువుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని చెప్పారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు తదితర సౌకర్యాలు ఏర్పాటుచేశామన్నారు. అనంతరం తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గది, విద్యార్థులకు అందించే షూలు, యూనీఫాం, భోజనశాల, స్టోర్ రూమ్ పరిశీలించారు. విద్యార్థుల డార్మెటరీని పరిశీలించి పాడైన తలుపుల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని, దోమలు రాకుండా మెస్‌లు బిగించాలని, నేలపై పడుకోకుండా మంచాలు పూర్తి స్థాయిలో ఏర్పాటుచేయాలని ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబుతో పాటు అధికారులను ఆదేశించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి పావనమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక సౌకర్యాల కల్పనకు టెండర్లు పిలిచామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. వారి వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సోషల్ వెల్ఫేర్ డీఈ సుబ్బరాజు, పీఆర్ డీఈ రాజ్‌కుమార్, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసమే సురక్ష



ఎ.వేమవరం శిబిరంలో అంగన్‌వాడీ ఫుడ్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి తదితరులు

అమలాపురం రూరల్: ఆరోగ్యవంతమైన సమాజమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ తెలిపారు. శనివారం మండలంలోని ఎ.వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఫుడ్ స్టాల్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్య పరీక్షల అనంతరం అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రావూరి వెంకటలక్ష్మి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ లింగోలు సత్యవతి, కార్యదర్శి కూచిమంచి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనపై విద్యార్థినులకు పోటీలు



అవినీతి నిర్మూలన పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థినులతో బ్యాంక్ అధికారులు, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: స్థానిక యూనియన్ బ్యాంక్ బ్రాంచి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అవినీతి నిర్మూలన అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు శనివారం జరిగాయి. అవినీతి నిర్మూలన వారోత్సవాల సందర్భంగా 8, 9 తరగతి విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చే దిశగా ఈ పోటీలు నిర్వహించినట్లు యూనియన్ బ్యాంక్ అధికారులు తెలిపారు. పోటీల విజేతలను ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్ వెల్లడించారు. వక్తృత్వ పోటీల్లో గంధం మాచర హిమబిందు(ప్రథమ), సుతాపల్లి లాస్య ప్రియ వర్షిణి(ద్వితీయ), పరమట శశికళ(తృతీయ), వ్యాసరచన పోటీల్లో గంధం మాచర హిమబిందు(ప్రథమ), పరమట శశికళ(ద్వితీయ), దేవాబత్తుల లక్ష్మీప్రసన్న(తృతీయ) బహుమతులను గెలుచుకున్నట్లు ఆయన వివరించారు. అనంతరం విజేతలకు బ్యాంక్ అధికారులు, ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేసి అభినందించారు.